# నమ్మలేని నిజం

"అన్నయ్యా! మాచెల్లి పెళ్లి కుదిరింది. ఎల్లుండి నిశ్చితార్థం. వదినతో సహా మీరు ముందుగా రావాలి. నాకు పెద్దదిక్కు మీరేగదా!" తోటల్లుడు రమణ ఫోన్‌లో బతిమాలాడాడు. పక్కింటి సమాచారమైనా, పరాయి దేశ సమాచారమైనా సెల్‌ఫోన్‌లో చేరవేయడం సర్వసాధారణమైన విషయం. ఆధునిక కాలంలో ఆత్మీయతానుబంధాలకు దూరశ్రవణ యంత్రాలు ఆధారమైనాయి గదా! ఆలోచనాలోచనాలు విచ్చుకునే లోగా లోపలినుండి శ్రీమతి మెరుపు తీగలా వచ్చి దొర్సానిలా నా పక్కన కూచుంది. చేతిలున్న సెల్‌ఫోన్‌ను గర్వంగా చూపిస్తూ... 'మాచెల్లెలు ఫోన్ చేసింది. ఎల్లుండి వాళ్ళ ఆడబిడ్డకు నిశ్చితార్థమటా... మనం రేపే వెళ్ళి తీరాలి...' హుషారుగా మురిసిపోయింది.

తోడబుట్టి కూడిపెరిగిన అక్కాచెల్లెళ్ళ అనుబంధమంటే, కనకాంబరం మొక్కకు చుట్టుకున్న మల్లెతీగలాంటిదని మరోసారి రుజువైంది.

ఎండాకాలం... దూరప్రయాణం.... నొప్పించక తానొవ్వక తప్పించుకునే ఉపాయమేముందబ్బా..? ఏమనాలో తోచక బెల్లం గొట్టిన రాయిలా కింనాస్తి ఐపోయాను. అర్ధాంగి నా మౌనాన్ని అర్ధాంగీకారంగా భావించిందేమో... "ఏమాలోచిస్తున్నారు? ఉన్న పిల్లలిద్దరూ ఉద్యోగం చేస్తూ అమెరికాలున్నరు. బాదరబందీలేవీ లేవు. లింగులిటుకుమంటు ఇద్దరమే ఉన్నాం గదా! మీరింకా ఆలోచించాల్సిన పనిలేదు...మనం వెళ్తున్నాం అంతే!" ఆర్డర్ జారీ చేసింది.

ఈ వయసులో అర్ధాంగి ఆర్డర్‌కు అపీలు లేదాయే...! అది తు.చ. తప్పకుండా అమలయింది. సూర్యోదయంతో పోటీ పడుతూ నిద్రలేచి తయారై బయలుదేరాము. సూర్యాపేటలో దిగేసరికి సూర్యుడు నడినెత్తిమీద ప్రతాపం చూపిస్తున్నాడు. మార్చిలోనే ముదిరిన ఎండలు మంత్రివర్గంలో చేరిన కొత్త ఎమ్మెల్యేలా ఆగమాగం చేస్తున్నాయి.

మేము వెళ్ళేసరికి ఇల్లు అంగడి బజార్‌లాగుంది. స్వాగత సత్కారాలలో క్షేమసమాచారాలు ఇచ్చిపుచ్చుకున్నాము. అప్పటికే సకుటుంబ సపరివారంగా వేంచేస్తున్న అతడి బాల్యస్నేహితుడు వెకంటేశము సహా పరిచయం చేశాడు రమణ. వెంకటేశం పిల్లలు పదేళ్ళ రంజిత్, ఎనిమిదేళ్ల నవనీత్ పిడుగుల్లాగున్నారు. అంత సందడికి కారణం ఆ పిడుగుల అల్లరేననీ అప్పుడే అర్థమైంది.

నోరు మంచిదైతే ఊరు మంచిదంటారు గదా! మాటల మూటలు విప్పి కులాసాగా కూచున్నాం. వెంకటేశం దంపతులు దగ్గరి బంధువుల్లా ఆప్యాయంగా మాట్లాడ్తుంటే మాలో ఉత్సాహం ఉరకలు వేసింది. పిల్లలు టీవీ ముందు కూచుని ఏదో క్రైం ప్రోగ్రాం చూస్తున్నారు. మాటల మధ్యన వెంకటేశం 'రమణ, నేను చాలా దగ్గరి స్నేహితులం సార్! ఎవరింట్ల ఏ చిన్న ఫంక్షన్ జరిగినా ఇద్దరం కలిసి పంజేస్తాం...' నన్నని మీసం కట్టును సగర్వంగా తడుముకున్నాడు.

'అవునన్నయ్యా... మా స్నేహం అన్యోన్యమయింది...' రమణ బలపరిచాడు. మాకు చాలా సంతోషమనిపించింది. మేము వెంట తీసుకెళ్ళిన అరటి పళ్ళ సంగతి గుర్తుకొచ్చింది. మ్యాజిక్ కళాకారుడు బుట్టలోంచి బంతులు తీసినట్టుగా బ్యాగులోంచి అరటిపళ్ళు తీసాను. టీ.వీ. ముందున్న పిల్లల్ని పిలిచాను. రేసు గుర్రాల్లా పరుగెత్తుకొచ్చారు. అందరికీ పంచేసింతర్వాత ఓ అరటిపండు మిగిలింది.

'ఇదెవరికివ్వాలి...?' పిల్లల్ని అడిగాను సరదాగా...

'నాకే ఇవ్వాలి అంకుల్...' నవనీత్ నా చేతిలున్న అరటిపండు లాక్కోబోయాడు.

'అట్లెట్ల? అది నాకే యివ్వాలి...' తుంటరి రంజిత్ తమ్ముని పక్కకు తోసేసి లాక్కున్నాడు. తొసుకొస్తున్న కోపాన్ని తట్టుకోలేక నవనీత్ ముక్కుపుటాలు వణుకుతున్నాయి. మొహం జేవురించింది.

'అరేయ్... నిన్ను కత్తితో నరికేస్తా..." కసిగా పళ్ళునూరాడు. కళ్లల్లో క్రౌర్యం ఛాయలు కదలాడుతున్నాయి. తానేమీ తక్కువ తిన్నానా అన్నట్టుగా రంజిత్ ఒంటికాలుమీద లేచాడు.

'అరేయ్! ఇది నాకే యివ్వాలిరా బాడ్కావ్! నేను పెద్దోన్ని... నాకివ్వకపోతే పిస్టోల్‌తో షూట్‌చేసి పారేస్తా...' గల్లా అందుకున్నాడు. నవనీత్ కూడా రంజిత్ గల్లా బట్టి లాగాడు..

'అరేయ్! నిన్ను ముక్కలు చేస్తా...' పిడికిలి పైకి లేచింది.

'నిన్నిడిచి పెడతానా! బడితేకట్టె అందుకుని నీ తలకాయ పలగ్గొడుతా.' ఇద్దరూ గింజుకుంటున్నారు.

'పోరా... పో!'

'పోబే... పో!' పెనుగులాడుతున్నారు. అరటి పండు కిందపడి కాళ్లకింద నలిగిపోయింది. గోరంత తగాదా గొడ్డలిదాక వచ్చిందని మేము ఆశ్చర్యంలో మునిగాము. ఇహ లాభం లేదనుకుని ఇద్దరినీ విడదీశాము. కాసేపు గుడ్లు దెరిచి గుర్రుగా చూసుకున్నారు. ఆ తర్వాత ఏమీ జరగనట్టుగా తిరిగి టీవీ కతుక్కుపోయారు.

'చూసింర్రా సార్! మా పిల్లలెంత హుషారుగున్నరో!' వెంకటేశం కనుబొమ్మలెగిరిపడ్డాయి. భార్య మురిసిపోతుంది.

'మా పిల్లలకు నేరాలు-ఘోరాలు, రక్తాక్షరాలు, యాక్షన్-రియాక్షన్, ప్రోగ్రాం అంటే చాలా ఇష్టం. రోజూ చూస్తరు...' ఆమె కళ్లల్లో ఆనందతరంగాలు ఎగిరిపడుతున్నాయి.

నాకేమో కాలినడకన తిరుమల కొండెక్కుతూ జారి లోయలో పడ్డట్టనిపించింది. మందుచూపు లేని టీవీ ఛానెళ్ల నేరాలు ప్రసారాలు తెల్లని పసిపిల్లల మనసు తెరమీద ప్రవృత్తి మరకలు అద్దుతున్నాయి. తెల్లనివన్ని పాలు, నల్లనివన్ని నీళ్లు అనుకునే రేపటి పౌరుల హృదయాల్లోంచి ఆత్మీయతానుబంధాల్ని తుడిచేస్తున్నాయి. లోలోపల అనుకున్నాను.

పైకి మాత్రం 'ఆ ,ప్రోగ్రాం చూస్తే బాగుండదేమో..' పెదాలు చప్పరించాను.

'వాళ్ళు చిన్న పిల్లలన్నా... గవన్నీ వాళ్లకేం తెలుసు...? రకరకాల ప్రోగ్రాంలు చూస్తూంటే పిల్లల తెలివితేటలు బ్రహ్మాండంగా పెరిగిపోతై గదా!' శ్రీమతి వెంకటేశం మొహం హరివిల్లయింది.

'అది కాదు వెంకటేశం! చిన్న పిల్లల మనసు వెన్నముద్దలాంటిది....' క్లాస్ పీకాలనుకుని ప్రారంభించాను.

'మీరోసారి అర్జంటుగా ఇటు రావాలి...' నా భార్య పిలిచింది.

అర్ధాంగి పిలుపు యమర్జంటు ఆర్డర్ గదా! లేచి రామబాణంలా వెళ్లాను. నా చెయ్యిబట్టి గదిలోకి లాక్కెళ్ళింది.

'మీరు చెప్పేది వాళ్లకు రుచించదు. మీదంతా బూజుపట్టిన బూర్జువా ఆలోచననీ, పాత చింతకాయ పచ్చడనీ అనుకుంటారు. ఆ విషయం వదిలెయ్యండి....' మందలిస్తూ క్లాస్ పీకింది. నా బుర్రలో భూగోళం గిర్రుమంది అంతా అయోమయం.

రమణ చెల్లి నిశ్చితార్థం కార్యక్రమం సజావుగా, సాంప్రదాయంగా పూర్తయింది. కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆపలేరు. నెల రోజుల్లో నూతన వధూవరుల మనసులు మూడుముళ్లతో ముడిపడ్డాయి. రమణ చెల్లి అందాల భరణి. ఆమె అదృష్టరేఖ భర్తను మూడేళ్లపాటు అమెరికా పంపించింది. అమ్మాయిని అదిలాబాద్‌లోనే ఉంచేసి, అబ్బాయి అమెరికాలో బాగా సంపాదించి తిరిగి వచ్చాడు. అంతా కలిసి ఐదు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయినై.

ఉద్యోగపర్వంలో ఎన్నో అధ్యాయాలనధిగమిస్తూ అలసిపోయాననీ ప్రభుత్వం నాకు రిటైర్మెంట్ వరమిచ్చి విశ్రాంతి తీసుకొమ్మంది. ఉద్యోగ బాధ్యతల నుండి బయటపడగానే పంజరంలోంచి విడుదలైన పావురంలా స్వేచ్ఛాజీవినైపోయాను. గ్రాట్యూటీ, కమ్యుటేషన్, పి.ఎఫ్, లాంటి పెన్షనరీ బెనిఫిట్స్‌తో ఇల్లు కొనేశాను. మొదటిసారి పెన్షన్ తీసుకుంటూంటే ఉద్యోగయానంలోని ఒడిదుడుకులన్నీ నెమరుకొస్తుంటే మనసులో మలయమారుతం వీచింది. .

సుప్రభాత కిరణాలు బంగళాకు వెలుతురు పూతలు పూస్తుంటే యోగాభ్యాసం వగైరా నిత్యకృత్యాలు ముగించుకొని సోఫాలో కూచున్నాను. కులాసాగా దినపత్రిక తిరగేస్తూ వార్తలు ఏరుకుంటున్నాను. రాయంచలా అడుగులేస్తూ వచ్చి పక్కన కూచున్న శ్రీమతి అందించిన వేడి చాయ్‌ను ఆస్వాదిస్తుంటే నరాల్లో నూతనోత్తేజం జరజరాపాకింది. పక్కనున్న సెల్‌ఫోన్ గణగణమోగింది.

"హల్లో... అవున్నేనే...!"

"అన్నయ్యా! నేనురమణను. మా చెల్లి బుల్లిపాపకు జన్మనిచ్చిందని చెప్పాను గదా...!"

'అవును... సుఖప్రసవమని గూడా చెప్పావు...'

'అవునవును...! ఎల్లుండి పాప నామకరణోత్సవం.. వదినా మీరు వెంటనే బయలుదేరి వచ్చి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయించాలన్నయ్యా...!'

'వెంటనే అంటే ఎట్లా...?'

'ఇప్పుడుద్యోగ బంధాలేవీ లేవు గదా...?' 'మీ కోసం ఎదిరి చూస్తుంటాం...'

శ్రీమతి అత్యుత్సాహం సెల్‌ఫోన్ లాక్కుంది. వాళ్ల చెల్లితో పదినిమిషాలు మాట్లాడింది. 'అబ్బా! కామన్ సెన్సు లేదు... పనిలేని మాటలన్నీ ఫోన్‌లో మాట్లాడ్తే బిల్లు పెరిగిపోదా!' నాలో నేనే కుతకుత లాడుతున్నాను. ఆవిడ ముఖారవిందం వంద రేకులుగా విచ్చుకుని వెలిగిపోతుంది. మూడు రాళ్ళ ముక్కుపుడక వెలుగులు నుదుటి కుంకుమ బొట్టును పలుకరిస్తున్నాయి. ముడతలు తొంగిచూస్తున్న నుదుటి మీద ముంగురుల్ని లాఘవంగా సవరించుకుంది. చాక్లెట్ కోసం చిన్నపిల్లలా మొహంపెట్టి 'మనం ఈ రోజే వెల్దామండీ...' బుంగమూతి చూపించింది.

'ఈ రోజెట్లా కురదురుద్దోయ్??! ఇవ్వాళ్ళ సాయంత్రం ఓ సాహిత్య కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవాలి. రేపుదయం వెళ్దాంలే..' చిలిపిగా ముక్కులాగి వదిలేశాను.

ముసిముసి నవ్వుల వెలుగులు కళ్లలో కదలాడ్తుంటే... 'అబ్బా! సంబడం...' అంటూ మూతి వంకర్లు తిప్పింది.

'అరవైకొస్తున్నా... ఇంకా ఇరవయ్యేళ్ళ బాలకుమారుడిలా ఇవేం కొంటె చేష్టలో...' ఖాళీ కప్పులందుకుని లోపలికెళ్లిపోయింది.

నిజమే! నడివయసు దాటుతోంది గదా!

xxxxx

సంసారంలోని సరిగమలను విశ్రాంత జీవనంలోని పదనిసలతో అనుసంధానం చేయగల్గుతున్నాను. భార్యతో సహా రమణ ఇంటికి చేరుకున్నాను. ఇంట్లో ముందట్లాగా చెప్పుకోదగిన సందడేమీ లేదు. బంద్ రోజున బస్టాండ్ లా నిశ్శబ్దంగా ఉంది. రమణ దంపతులు, మేము ఎదురెదురు సోఫాల్లో కూచున్నాము. లోకాభిరామాయణం కబుర్లు చెప్పుకుంటూ చాయానందాన్ని చప్పరిస్తున్నాము.

లోపలివైపునుండి పసిపాప ఏడుపు గంధర్వగానంలా వినబడుతోంది. పసిపాపను ఊరడించేందుకు తల్లి బుజ్జగింపులు కర్ణాకర్ణిగా వినబడుతున్నాయి. రమణ ఉద్యోగ బాధ్యతల గురించి, నా రిటైర్మెంట్ లైఫ్ గురించి మాటామంతి నిరాఘాటంగా సాగింది. రమణ బాల్యస్నేహితుడు వెంకటేశం అతని పిల్లల అల్లరి గుర్తుకొచ్చింది. ఆ పిల్లల అరటిపండు ఆరాటం... మనసుతెర మీద ఆనాటి దృశ్యం కదలాడింది.

'అన్నట్టు రమణా! మీ ఫ్యామిలీ ఫ్రెండ్, బాల్య స్నేహితుడు వెంకటేశం ఎప్పుడొస్తాడూ...? వాళ్ళ పిల్లలేరీ..?" ముసిముసి నవ్వుతో అడిగాను.

రమణ మొహంలో రంగులు మారాయి. గాలి తీసిన ట్యూబులా డీలా పడిపోయాడు.

'మా ఫ్రెండ్ వెంకటేశ మీలోకంలో లేడన్నయ్యా...'

చిన్నపాటి షాక్‌కు గురయ్యాను. ఆ మాట నమ్మశక్యం కాలేదు.

'అయ్యో... పాపం! చాలా సోషల్‌గా వుండేవాడు. ఎట్లా చనిపోయాడు? ఎప్పుడూ...?" ఎదలోని గందరగోళం ప్రశ్నల రూపంలో బయటికొచ్చి రెక్కలు విప్పింది.

'పాపం! ఏదన్నా ప్రమాదమా?' నా భార్య ముక్కు మీద వేలేసుకుంది. నుదుటి కుంకుమ బొట్టు ఉదాత్తంగా కనబడింది.

'చాలా దారుణం జరిగిపోయింది. వదినా! వాళ్ల పెద్దకొడుకే అతనిపాలిట యముడైనాడు...'

'అదెట్లా బ్రదర్!' నా ఆసక్తి.

'వాళ్ల పిల్లలిద్దరూ చినప్పప్పట్నుంచి క్రైం సినిమాలు, టీవిలో క్రైం ప్రోగ్రాంలు చూసేవారు గదా! అదే తత్వం వాళ్ల మనసుల్లో నాటుకుపోయింది...'

'అంటే...?'

'ఏముందన్నయ్యా! పెద్దాడు రంజిత్ టెన్త్‌లో ఫెయిలైండు. తల్లి మందలించింది. తండ్రి చెంపదెబ్బ వేసిండు. పిల్లాడదో అవమానంగా భావించాడేమో... తండ్రి మీద పగబట్టిండు. అందరూ నిద్రలో ఉన్నప్పుడు వాడు లేచి కూరగాయలు తరిగే కత్తిపీటతో వెంకటేశం గొంతు కోశాడు. అల్లరి, అంగలార్పులు, ష.రా.మామూలే.. వీధి జనాలు మేల్కొని వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ ఆ లోగానే ప్రాణాలు పోయినై."

'అయ్యో పాపం! వాళ్ళ భార్యాపిల్లలెక్కడున్నారయ్యా!" నా భార్య అడిగింది.

'వెంటనే అతని భార్య గుండెపోటుతో చచ్చిపోయింది. పెద్ద కొడుకు రంజిత్ జైల్లో వున్నాడు. చిన్న పిల్లాడు అనాథ శరణాలయంలో ఉన్నాడు...!!"

--- x ---

(ముంబైవన్, 15-6-2011)